# అమాయకుడు



"ఒరేయ్ రవీ... ఈరోజు నువ్వు కాలేజీకి రాలేదు కాని, గిరీశం మాస్టారు భలే కథ చెప్పార్రా! అది విని పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వాం. తలచుకుంటే ఇప్పటికీ నవ్వు వస్తోంది" అంటూ నవ్వసాగాడు రాజు రూంలోకి ప్రవేశిస్తూనే.

"ఒంట్లో బాగుండక కాలేజి మానేశాను. బయటకు పోకపోవడంతో బోర్ కొట్టోంది. చెప్పరా అదేమిటో... కాస్త రిలీఫ్‌గా ఉంటుంది" అన్నాడు రవి.

"చెప్తాను. కాని, మాస్టారు చెప్తే ఉండే మజా వేరు!" అంటూ మొదలుపెట్టాడు రాజు–

"ఓ ఊళ్లో ఒక అమాయకుడు ఉండేవాడు. అతని పేరు ఏదైతేనేం... ప్రస్తుతానికి మనం 'మాలోకం' అనుకుందాం. పాపం... మాలోకం బొత్తిగా లౌక్యం లేని మనిషి. ఎవరితో ఎలా మాట్లాడాలో తెలియదు. అందువల్ల అందరికీ లోకువ అయిపోయాడు. తోచీ తోచని ప్రతివాడు మాలోకాన్ని కాసేపు ఆటపట్టించి కాలక్షేపం చేయడం పరిపాటి అయింది. మాలోకం నిజంగానే అమాయకుడు. ఆ కారణం చేత అవతలివాళ్ళు అనేవి అర్థంకాక, అర్థంచేసుకోలేక ఏమీ అనుకునేవాడు కాదు, అనేవాడు కాదు. కాని, అతని తల్లిదండ్రులకు మాత్రం ఇది చాలా బాధగా ఉండేది. ఈ బాధ పడలేక ఒకసారి వాళ్ళు మాలోకాన్ని పిలిచి బుజ్జగించి, బుద్ధులు చెప్పి, 'నాయనా మాలోకం... నీకు ప్రపంచ జ్ఞానం బొత్తిగా లేదురా. ఎవరితో ఎలా మాట్లాడాలో తెలియకపోవడం వల్ల నువ్వు అందరికీ లోకువ అయిపోయావు. నువ్వు ఎవరితోనూ మాట్లాడకు. నలుగురూ కూర్చున్న చోటికి పోయి, వాళ్ళు ఎలా మాట్లాడుకుంటున్నారో జాగ్రత్తగా గమనించు. కొన్నాళ్ళకి కాకపోతే కొన్నాళ్ళకి నీకు నలుగురితో మాట్లాడ్డం చేతనవుతుంది' అని సుద్దులు చెప్పారు.

'ఓస్... ఇంతేకదా! అలాగే చేస్తాను' అంటూ భరోసా ఇచ్చాడు మాలోకం.

ఆ మర్నాడు ఊర్లోకి బయలుదేరాడు మాలోకం.

కరణంగారింటి ముందు జనం మూగి ఉన్నారు. ఏమిటా... అని చూస్తే కరణంగారి తల్లి చనిపోయింది. నలుగురూ ఆయన్ని- 'ఎంత చల్లని తల్లండీ మీ అమ్మగారు... అందర్నీ తన స్వంత బిడ్డలుగానే చూసుకునేవారు. ఇప్పుడు మా అందరి గతీ ఏమిటి?' అంటూ పరామర్శిస్తున్నారు.

మాలోకం ఇదంతా జాగ్రత్తగా గమనించాడు.

'ఓహో! ఎవరైనా చనిపోతే ఇలా పరామర్శించాలన్న మాట!' అని కొంచెం ప్రపంచజ్ఞానం నేర్చుకున్నాడు.

మరికొన్నాళ్లకి... కరణంగారి భార్య చనిపోయింది.

నలుగురితోపాటు మాలోకం కూడా పరామర్శకి వెళ్లాడు. అప్పటికి అతనికి ప్రపంచజ్ఞానం, కనీసం ఇలాంటి విషయాలలో బాగానే అబ్బిందన్న నమ్మకం అతనికి ఏర్పడింది. అందువల్ల ధైర్యంగా అతను నలుగురితోపాటు పరామర్శించడానికి పూనుకున్నాడు.

'కరణంగారూ... మీకెంత కష్టం వచ్చిందండీ! మీ భార్యామణి ఎంత చల్లని తల్లండీ... ఆమె మిమ్మల్నే కాదు, మమ్మల్నందర్నీ కూడా స్వంత భర్తలుగా చూసుకునేవారు. ఇప్పుడు మా అందరి గతి ఏమిటండీ?!' అంటూ బిగ్గరగా శోకాలు మొదలుపెట్టాడు.

ఆ శోకాలు విని నిశ్చేష్టులయి మిగిలినవారు తమ శోకాలు ఆపేశారు. ఏడ్చేవాళ్ళు ఏడవలేక, నవ్వు వచ్చినవాళ్ళు నవ్వలేక... మొత్తంమీద అందరూ నవ్వలేక, ఏడవలేక దిగ్భ్రమ చెంది, ఆ తర్వాత కరణంతో సహా అందరూ మాలోకాన్ని పట్టుకొని సున్నంలోకి ఎముక లేకుండా తన్ని పంపించారు. అక్కడితో మాలోకం ప్రపంచజ్ఞానంతో ప్రయోగాలు మానుకున్నాడు. ఈ కథ మాస్టారు అభినయపూర్వకంగా చెప్తుంటే... నవ్వి, నవ్వి ఆయాసపడిపోయాం. కన్నీళ్లు వచ్చేశాయి" అంటూ కథ ముగించాడు రాజు.

"నువ్వు చెప్పిన కథ చాలా పాతదే.., ప్రజలలో బాగా చలామణీలో ఉన్నదే. నాకు తెలిసినదే కాబట్టి నాకు అంత నవ్వు రాలేదు. నీకు కొత్త కనుక బాగా నవ్వు వచ్చి ఉంటుంది. అయితే ఈ మాలోకం నిజమైన వ్యక్తో, కల్పిత వ్యక్తో మనకి తెలియదు. కాని, అటువంటి, అంతటి, అమాయకుడి కథ ఒకటి నాకు తెలుసు. ఇది నిజంగా జరిగిందని మా నాన్నగారు చెప్తుండేవారు."

"అదేమిటో చెప్పరా. జీవితం- కల్పనకన్నా మధురంగా ఉంటుందంటారు. చెప్పు... నువ్వు చెప్పే కథ నేను చెప్పిన కథకంటే హాస్యవంతంగా ఉంటుందేమో!" అన్నాడు రాజు.

"విని అదేమిటో నువ్వే చెప్పాలి" అంటూ మొదలుపెట్టాడు రవి.

"అవి బ్రిటిష్‌వాళ్ళు మన దేశాన్ని ఏలుతున్న రోజులు. తెల్లవారు, నల్లవారు కూడా అధికారులుగా ఉండేవారు. వారికి విశేషమైన అధికారాలుండేవి. అధికార దర్పం చూపించుకోవడంలో మన నల్లదొరలు తెల్లదొరలను మించిపోయి ఉండేవారు. వారి మన్ననలు పొందడం కోసం వారి క్రింద పనిచేసే ఉద్యోగులు మానాభిమానాలు చంపుకొని, నీచాతినీచమైన సేవలు కూడా చేస్తుండేవారు. ఆ గులాంగిరీ చెయ్యడంలో ఈ కాకాసురులు ఒకరితో ఒకరు పోటీ పడుతుండేవారు. ఇటివంటి ఆశ్రిత జనం అండదండలతో ఈ అధికార్లు మకుటంలేని మహారాజుల్లాగా చలామణి అవుతుండేవారు.

అలాంటి రోజుల్లో ఒక ఇనస్పెక్టరుగారు పిల్ల జమీందారులాగా గడుపుతూ ఉండేవాడు. సరే... అటువంటి అధికారి చుట్టూ ఆశ్రిత వలయం అపారంగా ఉంటుందని వేరే చెప్పనక్కరలేదుగా! భక్తులందరూ యథాశక్తి ఆయనకి సకల సేవలు చేస్తుండేవారు.

ఒకసారి ఆ ఇనస్పెక్టర్‌గారి తల్లి మరణించింది.

నిమిషాల మీద భక్త బృందం అంతా అక్కడ- మామిడి పండు రసం మీద ఈగలు ముసిరినట్లు ముసిరారు. కొందరు భక్తి కీర్తనలు పాడారు. మరికొందరు మద్దెలమోగించారు. ఇంకొందరు తాళాలు వాయించారు. ఇవేవీ చేయలేనివారు వాళ్ళ యథాశక్తి శ్రుతిబద్ధంగా ఆరున్నొక్క రాగంలో ఏడుపు లంకించుకున్నారు. మరికొందరు ఇనస్పెక్టరుగారి తల్లి పోవడం-

భూలోకానికి మహా లోపమనీ, మానవ జాతికి గ్రహణం పట్టిందనీ.., అంతటి దుఃఖాన్ని ఎంతటి గుండె నిబ్బరంతోనో ఆయన మేరునగధీరుడు కాబట్టి తట్టుకోగలిగాడని, ఇంకొకరైతే ఠారున గుండె పగిలి గుటుక్కుమనేవారనీ అనునయ వాక్యాలు పలికారు.

భక్త బృందంతోపాటు యథాశక్తి ప్రదర్శన ఇయ్యడానికి సుబ్బయ్య కూడా వెళ్లాడు. అతను నిఖార్సయిన అమాయకుడు. అతన్ని చూసే మన తెలుగు సినిమాల్లో పల్లెటూరి హీరోపాత్రలను సృష్టిస్తుంటారు. ఇనస్పెక్టరుగారు పాలు నల్లగా, నీళ్లు తెల్లగా ఉంటాయంటే అతనికి అలాగే కనిపిస్తాయి. అంతటి అధికారధేయుడు అతను.

ఇనస్పెక్టర్‌గారు మరణించిన తల్లిని తలచుకొని కన్నీళ్లు పెట్టుకుంటుంటే చూడలేకపోయాడు సుబ్బయ్య. ఆ దృశ్యం చూడలేక కళ్లమీద కండువా వేసుకుని వెక్కి వెక్కి ఏడవసాగాడు. మధ్య మధ్య కండువా తప్పించి చూస్తూ, ఇనస్పెక్టరుగారు తన వంక చూసినప్పుడు మరీ బిగ్గరగా ఏడవసాగాడు. ఇనస్పెక్టరుగారు కూడా సుబ్బయ్య విధేయతకీ, అభిమానానికీ సంతోషించాడు.

శవాన్ని పాడె మీద పెట్టి కట్టేశారు. పాడె ఎత్తేసరికి బంధువులు బిగ్గరగా రోదనం మొదలుపెట్టారు. వారందరి రోదనాన్ని నేపథ్యంలోకి నెట్టూ... సుబ్బయ్య గుండెలు బాదుకుంటూ 'నాయనోయ్... దేవుడోయ్... ఎంతపని చేశావురోయ్!' అంటూ బిగ్గరగా దిక్కులు అదిరేటట్లు ఏడవసాగాడు. అతని ఏడుపులకు బంధువులు నివ్వెరపోయి, తమ ఏడుపులు ఆపేశారు.

గోవింద నామస్మరణ మధ్య పాడె కదిలింది. భక్త బృందంలో కొందరు వంతుల వారీగా భుజం కాస్తే, మరికొందరు యథాశక్తి కొంతదూరం శవాన్ని సాగనంపి, తమ తమ ఇళ్లకు వెళ్లారు.

శవ దహనం జరుగుతోంది. కాటి కాపలాదారు ఏవో దయ్యాల కథలు చెప్తుంటే వెళ్లిన వారిలో కొందరు ఆసక్తితో వింటున్నారు, మరికొందరు ఓ ప్రక్కన కూర్చుని పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు, స్మశాన వైరాగ్యంతో ఏదో ఆలోచిస్తూ ఓ తులసికోట గట్టు మీద కూర్చున్నారు ఇనస్పెక్టరుగారు.

కాలుతున్న కాళ్లని కర్రతో లేపి మంటల్లో వేశాడు కాటివాడు. ఆ దృశ్యం చూసి ఉన్నట్లుండి పెద్ద అరుపులతో గుండెలు బాదుకుంటూ తిరిగి శోకన్నాలు మొదలుపెట్టాడు సుబ్బయ్య. అందరూ మాటలు ఆపి అతనివంక తిరిగారు. ఇనస్పెక్టరుగారు నివ్వెరపోయారు. తర్వాత తేరుకుని 'సుబ్బయ్యా...' అని పిలిచాడు. దుఃఖాన్ని ప్రయత్నం మీద ఆపుకుని 'అయ్యా...' అని సమాధానం ఇచ్చాడు సుబ్బయ్య.

'మీ అమ్మగారు బ్రతికే ఉన్నారా..?' అని అడిగారు ఇనస్పెక్టరుగారు.

'చిత్తం... వారు చనిపోయి చాలాకాలం అయిందండీ!' అన్నాడు సుబ్బయ్య చేతులు కట్టుకుని.

'నీ ఏడుపు చూస్తుంటే- పోయింది మా అమ్మగారో, మీ అమ్మగారో తెలీక నాకు మతి పోతోందయ్యా!' అన్నారు ఇనస్పెక్టరుగారు. అంత విచారంలోనూ ఆయనలో హాస్యం తొంగిచూసింది.

'చిత్తం... మా అమ్మగారు ఒకటీ, తమ అమ్మగారు ఒకటీనా దొరగారూ!' అన్నాడు సుబ్బయ్య.

'ఆమె పోయినప్పుడైనా నువ్వు ఇంతగా ఏడ్చావా... అని నా అనుమానం!' అన్నాడు ఇనస్పెక్టరుగారు.

'ఆమె గుమాస్తా ముండాకొడుకు తల్లి. ఈమె ఇనస్పెక్టరుగారి తల్లి. ఆమె పోతే ఇంతగా ఎందుకు ఏడుస్తాను దొరగారూ?' అన్నాడు సుబ్బయ్య.

ఇనస్పెక్టరుగారికి నవ్వాగింది కాదు. ఆయన నవ్వడం చూసి మిగిలినవారు కూడా ఫక్కున నవ్వారు. 'అది సరేనయ్యా! ఇంతకీ... మా అమ్మ పోతే నువ్వెందుకయ్యా ఏడవడం?' అని ప్రశ్నించాడు ఇనస్పెక్టరుగారు.

'అదేమిటి దొరవారూ... మేము మీ తాబేదార్లం. తమరికి కష్టం వస్తే మేము ఏడవకపోతే తప్పుకాదూ? తమకు కోపం రాదూ?' అని అమాయకంగా జవాబిచ్చాడు సుబ్బయ్య. అతని సమాధానానికి ఏడవాలో, నవ్వాలో తెలీక నవ్వేశారు ఇనస్పెక్టరుగారు.

'శహభాష్... అదేదో దేశంలో మృతజీవులకు ఉత్తమ గతులు కల్పించడం కోసం డబ్బిచ్చి జనాన్ని ఏడ్పిస్తారట. నిన్నూ అక్కడికి పంపించాలయ్యా!' అన్నారు ఇనస్పెక్టరుగారు.

'చిత్తం... అంతా తమ దయ!' అన్నాడు సుబ్బయ్య.

- ఇప్పుడు చెప్పు... నా కథ ఎలా ఉంది?" అని ముగించాడు రవి.

"నీ సుబ్బయ్య ముందు నా మాలోకం బలాదూర్. నీ సుబ్బయ్యే అతనికంటే గొప్ప అమాయకుడు!" అన్నాడు రాజు.

ఈ కథలను తలచుకొని రాజూ, రవీ పగలబడి నవ్వుకోసాగారు.

•

- భారత మిత్రం... *11 నవంబర్ '79*